నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, సోమవారం 3 ఫిబ్రవరి 2025 | KARIMNAGAR

## కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు

కరీంనగర్ కార్పొరేషన్, ఫిబ్రవరి 2: బడ్జెట్ కేటాయింపుల్లో కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు అన్యాయం చేసిందని, రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలున్నా సాధించిందేమీ లేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. పార్లమెంట్‌లో శనివారం కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన 2025 –26 బడ్జెట్ గణాంకాలను పరిశీలిస్తే రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులున్నప్పటికీ ఒక్క ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకురాలేకపోయారన్నారు. వెనుకబడిన జిల్లాల జాబితాలో రాయలసీమను, ఉత్తరాంధ్రను చేర్చారని, కానీ తెలంగాణ నుంచి ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్, ఆదిలాబాద్, భద్రాది కొత్తగూడెం లాంటి జిల్లాలను ఎందుకు చేర్చలేదో చెప్పాలన్నారు. వివిధ ప్రాజెక్టుల కోసం ఆంధ్రప్రదేశ్‌కు రూ.15 వేల కోట్లు కేటాయించారని, మరి తెలంగాణకు ఎందుకు కేటాయించలేదో కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ సమాధానం చెప్పాలన్నారు. వ్యవసాయ రంగానికి గతం కంటే రూ.10వేల కోట్లు తగ్గించారన్నారు. ఎరువుల సబ్సిడీకి రూ.11 వేల కోట్లు కోత విధించారని, దళితులకు కేవలం 5 శాతం మాత్రమే కేటాయించారని విమర్శించారు.

## 'రైతు భరోసా' నిలిపేస్తే సహించేది లేదు

కరీంనగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 2 : ఎన్నికల కోడ్ నెపంతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా నిలిపేస్తే ఊరుకునేది లేదని తెలంగాణ రైతుల ఐక్య వేదిక రాష్ట్ర కార్యదర్శి వేముల కొండల్‌రావు హెచ్చరించారు. ఆదివారం కరీంనగర్‌లోని ఆ సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర సర్కారు తెలంగాణ రైతాంగాన్ని ఘోరంగా మోసం చేస్తోందని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ ఇప్పటికీ పూర్తి స్థాయిలో చేయలేదని మండిపడ్డారు. రైతు భరోసా ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని చెప్పి రూ.12 వేలకు కుదించిందని, అది కూడా గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా గ్రామాల వారీగా విడుదల చేయడం రైతులపై వారికున్న సవతి తల్లి ప్రేమ స్పష్టమవుతోందని ఎద్దేవా చేశారు. ఇప్పటికే చెల్లించాల్సిన రెండు విడుతల భరోసా ప్రభుత్వం నిలిపేసిందని మండిపడ్డారు. సన్నాలకు చెల్లించాల్సిన బోనస్ కూడా ఇంకా పూర్తి స్థాయిలో చెల్లించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో సంఘం ఉమ్మడి జిల్లా నాయకులు రఘునాయకుల వీరారెడ్డి, మంద సత్యనారాయణరెడ్డి, చెన్నాడి సత్యంరావు, వీర్ల మనోహర్‌రావు, ముత్తినేని ఆగంరావు, తదితరులు పాల్గొన్నారు.

# ఇది పరీక్షా కాలం!



### 'పది' పరీక్షలకూ ముమ్మరం


పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణపై అధికారులు దృష్టి పెట్టారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కస్తూర్బా, మోడల్ స్కూల్స్, గురుకుల పాఠశాలల్లో మొత్తంగా 11,855 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇంటర్ పరీక్షలు ముగిసిన తర్వాత మార్చి 21 నుంచి పది పరీక్షలు ఆరంభం కానున్నాయి. మరో నెల పదిహేను రోజుల వ్యవధి ఉన్నప్పటికీ ఇప్పటి నుంచే అధికారులు పరీక్షల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. గతేడాది కంటే అధికంగానే పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసే అవకాశాలున్నాయని విద్యాశాఖ సిబ్బంది పేర్కొంటున్నారు.

### సన్నద్ధతకు మంచి సమయం


పరీక్షలు సమీపిస్తున్న ప్రస్తుత తరుణమే సన్నద్ధతకు అత్యంత కీలకమైందని విద్యావేత్తలు, ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. అదే పనిగా చదవడమే కాదు, తగినంత నిద్ర, సరైన ఆహారం, విశ్లేషణాత్మకమైన పద్ధతి, కీలకమైన ప్రశ్నల గుర్తింపు తదితర అంశాలపై దృష్టిని కేంద్రీకరించాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. పరీక్షల కాలంపై వారి అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

- మొదలైన ప్రాక్టికల్స్
- నేటి నుంచి ఇంటర్ ప్రయోగ, మార్చి 5 నుంచి థియరీ ఎగ్జామ్స్
- మార్చి 21 నుంచి పదో తరగతికి..
- అభ్యసనకు కీలక సమయమంటున్న విద్యావేత్తలు
- తగిన నిద్ర, ఆహారం తీసుకుంటే మేలని సూచనలు

పరీక్షా కాలం వచ్చేసింది. జూన్ ఆరంభం నుంచి ప్రారంభమైన విద్యా సంవత్సరం ముగింపు దశకు చేరుకున్నది. అటు పది, ఇటు ఇంటర్మీడియెట్ సమరానికి సమయం దగ్గరపడుతున్నది. ఇప్పటికే ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులు గత నెల 30 నుంచే 'పర్యావరణ శాస్త్ర పరీక్షతో' ఎగ్జామ్ సీజన్‌లోకి ప్రవేశించగా, ఈ నెల 3 నుంచి ప్రయోగాలు చేసి, మార్చి 5 నుంచి జగిత్యాల జిల్లాలో దాదాపు 13 వేల మంది థియరీ పరీక్షలు రాయబోతున్నారు. ఇక అదే నెల 21 నుంచి పదో తరగతి పిల్లలు 12వేల మందికి బోర్డు ఎగ్జామ్స్ ఉండగా, ఇది కీలక సమయమని, తగిన నిద్ర, ఆహారం తీసుకోవడంతోపాటు విశ్లేషణాత్మక పద్ధతిని అలవరుచుకుంటే మంచి ఫలితాలు వస్తాయని విద్యావేత్తలు సూచిస్తున్నారు.



జగిత్యాల, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ) : ఇంటర్ ప్రాక్టికల్స్ గత నెల 30 నుంచే ఆరంభమయ్యాయి. జగిత్యాల జిల్లా వ్యాప్తంగా ఫస్టియర్‌లో 7,054 మంది, సెకండియర్‌లో 6,141 మంది థియరీ పరీక్షలు రాయబోతున్నారు. ఫస్టియర్ పిల్లలు ఇప్పటికే ఒక సాధారణ పరీక్ష, పర్యావరణం సబ్జెక్టుకు ఎగ్జామ్ జరిగింది. 31న మొదటి సంవత్సరం, ఈనెల 1న రెండో సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. ఈ నెల 3 నుంచి ప్రాక్టికల్స్ ఆరంభం కాబోతున్నాయి. నాలుగు స్పెల్స్‌లో జరిగే ఈ పరీక్షలు వచ్చే ఈ నెల 25వ తేదీ వరకు జరుగనున్నాయి. మార్చి 5 నుంచి థియరీ పరీక్షలను బోర్డు నిర్వహించనుండగా, ఏర్పాట్లను ఇంటర్‌బోర్డు నియమించిన డెక్ టీమ్ దాదాపుగా పూర్తి చేసింది. జగిత్యాల ఇంటర్ నోడల్ అధికారి బొప్పరాతి నారాయణ నేతృత్వంలో పనులు జరుగనున్నాయి. ప్రాక్టికల్ పరీక్షలకు 29, థియరీ పరీక్షల కోసం 30 కేంద్రాలను ఏర్పాటు చేసే అవకాశాలున్నాయి.



### సమతుల ఆహారం, నిద్ర అవసరం



పరీక్షల సమయం ఆసన్నమైంది. విద్యార్థులు ఏడాదంతా చదివినప్పటికీ కంగారు పడుతుంటారు. అదే సమయంలో అన్ని సబ్జెక్టులు, అన్ని పాఠ్యాంశాలను చదివామా లేదన్న కంగారు పెరుగుతుంది. దీనికి తోడు తల్లిదండ్రులు సైతం తమ పిల్లల నుంచి అధిక మార్కులను ఆశిస్తారు. ఇవన్నీ క్రమంగా విద్యార్థిని ఒత్తిడికి గురి చేస్తాయి. పరీక్ష సమయంలో విద్యార్థులు ప్రశాంతంగా ఉండాలి. తల్లిదండ్రులు పిల్లలకు బలవర్ధకమైన, సమతులమైన ఆహారం ఇవ్వాలి. ముఖ్యంగా విద్యార్థులు నిద్ర విషయంలో జాగ్రత్త వహించాలి. ఉల్లాసంగా ఉండాలి. చదివిన ప్రశ్నలను మననం చేసుకోవాలి. మాంసాహారానికి దూరంగా ఉండడం మంచిది. అలా చేస్తే విజయం మన సొంతమవుతుంది.

**- కొంక వేణు, ప్రిన్సిపాల్**
**(కొడిమ్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల)**

### ఆబ్జెక్టివ్ ప్రశ్నలపై దృష్టి పెట్టాలి



ముఖ్యంగా ఇంటర్ ఆర్ట్స్ విద్యార్థులు ఆబ్జెక్టివ్ ప్రశ్నలపై దృష్టి పెట్టాలి. రెండు మార్కుల ప్రశ్నలను పూర్తిగా అధ్యయనం చేయాలి. పాఠ్య పుస్తకాల్లోని ఏ మూలనుండైనా ప్రశ్నలను సంధించేందుకు అవకాశం ఉంది. అందుకే ప్రతి పాఠాన్ని క్షుణ్ణంగా చదవాలి. ఇక చరిత్ర విద్యార్థులు మ్యాప్‌ను సైతం అధ్యయనం చేస్తే మంచి మార్కులు వస్తాయి. ఓపికగా అన్నీ చదవాలి. ఇంకా మంచి సమయం మిగిలి ఉంది.

**- కచ్చు మేఘశ్యాం, పౌరశాస్త్రం ఉపన్యాసకుడు**

### బట్టీ పద్ధతి మానుకోవాలి



విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో ఈ మధ్య ఒక చిత్రమైన పద్ధతి కనిపిస్తున్నది. మార్కులే పరమావధిగా విద్యార్థులు బట్టీ పద్ధతివైపు వెళ్తున్నారు. ఆఖరికి గణితం విషయం లోనూ అదే పద్ధతిని పాటిస్తున్నారు. ఇది సరైంది కాదు. బట్టీ పడితే గణితంలో రాణించలేమని గుర్తించాలి. లెక్కలను సాల్వ్ చేసే పరిస్థితి ఉండాలి. కానీ, బట్టీ పెడితే ఆ లెక్కలు రాకపోతే ఇబ్బందిపడుతారు. ఇప్పటికైనా మంచి సమయమే ఉంది. లెక్కలను సాధన చేయడం ఆరంభించాలి. మంచి మార్కులు సాధించడానికి అవకాశం ఉన్నది.

**- తుంగూరి సురేశ్, టీచర్ (మల్లాపూర్ హైస్కూల్)**

### విశ్లేషణాత్మకంగా ఆలోచించాలి



విద్యార్థులకు ఈ సమయం అత్యంత కీలకమైంది. సహజంగా విద్యార్థులు రెండు కేటగిరీల్లో ఉంటారు. చురుకైన విద్యార్థులు, అధిక మార్కుల కోసం ఆలోచించే వారు ప్రశ్నలను విశ్లేషించుకునే పద్ధతిని ఎంచుకోవాలి. ఇప్పటికే విద్యా సంవత్సరం ఆరంభం నుంచి కీలకమైన ప్రశ్నలు, మాదిరి లెక్కలను క్షుణ్ణంగా పరిశీలించి ఉంటారు. థియరీ పరీక్షలకు 30 రోజుల టైం మాత్రమే ఉంది. ప్రాక్టికల్ పరీక్షలు ఆరంభం కానున్నాయి. ఇక సాధారణ విద్యార్థులు ఏయే చాప్టర్లు ముఖ్యమైనవో గుర్తించి, మాదిరి ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి. అలా చేస్తే మెరుగైన ఫలితాలు వచ్చే అవకాశం ఉంటుంది.

**- శ్రీవాణి, కెమిస్ట్రీ లెక్చరర్**
**(జగిత్యాల ప్రభుత్వ జూనియర్ కాలేజీ)**

# మండలి నోటిఫికేషన్ నేడే

- ప్రారంభం కానున్న నామినేషన్ల ప్రక్రియ
- 10వ తేదీ వరకు స్వీకరణ
- 11న పరిశీలన, 13న ఉపసంహరణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

కరీంనగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 2 : కరీంనగర్– ఆదిలాబాద్– నిజామాబాద్– మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలకు నేడు నోటిఫికేషన్ విడుదల కానున్నది. నామినేషన్ల ప్రక్రియ కూడా నేటి నుంచే ప్రారంభమవుతుంది. కరీంనగర్ కలెక్టరేట్‌లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగనుండగా, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు మొత్తం పూర్తి చేశారు. సోమవారం నుంచి మొదలుకానున్న నామినేషన్ల పర్వం ఈనెల 10వ తేదీ వరకు కొనసాగనున్నది. 11న పరిశీలన, 13న ఉపసంహరణ ఉంటుంది. అదే రోజు పోటీలో ఉండే అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కలెక్టర్ పమేలా సత్పతి వ్యవహరించనుండగా, నామినేషన్లు స్వీకరించేందుకు కలెక్టరేట్ చాంబర్‌లో అన్ని ఏర్పాట్లూ చేశారు. ప్రభుత్వ పనిదినాల్లో ప్రతిరోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. నామినేషన్ పత్రాలు పూరించడంలో అనుమానాలు తొలగించేందుకు కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. కాన్ఫరెన్స్ హాలులో పట్టభద్రుల, ఉపాధ్యాయ మండలి నామినేషన్ పత్రాలు పరిశీలించిన అనంతరం రిటర్నింగ్ అధికారికి సమర్పించేలా తగిన సూచికలు ఏర్పాటు చేశారు. ఈ ప్రక్రియలో పాల్గొనేందుకు అవసరమైన అధికారులను కూడా ఎంపిక చేసి, వారికి శిక్షణ కూడా ఇచ్చారు. 70 మంది వరకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులను వినియోగించనున్నట్లు తెలుస్తోంది. ఉదయం 8.30 గంటలకే సంబంధిత అధికారులతో నామినేషన్ల స్వీకరణకు సంబంధించి ట్రయల్ నిర్వహించనున్నట్లు సహాయ రిటర్నింగ్ అధికారి, డీఆర్వో వెంకటేశ్వర్లు తెలిపారు. ఈనెల 27న జరుగనున్న పోలింగ్‌లో పాల్గొనేందుకు అర్హుల తుది జాబితా ఇప్పటికే విడుదలైంది. పట్టభద్రుల సెగ్మెంట్‌కు సంబంధించి 3,58,614 మంది, 28,872 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు. వీరంతా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా నాలుగు ఉమ్మడి జిల్లాల్లోని 271 మండలాల్లో 499 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. నామినేషన్ వేసిన నాటి నుంచే అభ్యర్థుల ప్రచారం, వాహనాల అనుమతులు, వారు చేసే ఖర్చులపై నిఘా ఉండనున్న దృష్ట్యా, సంబంధిత తనిఖీ బృందాలను కూడా ఇప్పటికే ఏర్పాటు చేశారు. ఇవి నేటి ఉదయం 11 గంటల నుంచి రంగంలోకి దిగనున్నాయి. కాగా, సోమవారం వసంతపంచమి కావడంతో మొదటిరోజు పలు పార్టీల మద్దతుతో బరిలోకి దిగబోతున్న పలువురు అభ్యర్థులు నామినేషన్లు వేసే అవకాశాలున్నాయి.

# పథకాలు పక్కకు పెట్టే ప్రయత్నాలు

- కేసీఆర్ పేరు వింటేనే కాంగ్రెస్ సర్కారులో కలవరం
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



మైనార్టీ గురుకుల కళాశాల గేటు ముందు విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఈశ్వర్

ధర్మపురి, ఫిబ్రవరి 2 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆనవాళ్లు పేరు వినిపించినా.. కనిపించినా కాంగ్రెస్ ప్రభుత్వానికి కలవరం మొదలైందని, ఆయన గుర్తుగా ఉన్న పథకాలను ఒక్కొక్కటి పక్కకు పెట్టేందుకు విశ్వప్రయత్నాలు జరుగుతున్నాయని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. ధర్మపురి పట్టణంలోని మైనార్టీ బాలికల గురుకుల కళాశాలలో రెండు రోజుల క్రితం ఆహారం వికటించి ఐదుగురు విద్యార్థులు అస్వస్థతకు గురికాగా.. వారిని పరామర్శించేందుకు ఆయన ఆదివారం గురుకులానికి చేరుకున్నారు. అయితే, గురుకులంలోకి కొప్పుల ఈశ్వర్‌ను అనుమతించలేదు. దీంతో ఆయన ప్రిన్సిపాల్‌కు లక్ష్మికి ఫోన్ చేయగా.. గురుకుల గేటుదాటి లోనికి ఎవరినీ అనుమతించకూడదని కలెక్టర్ నుంచి ఆదేశాలున్నాయని తెలపడంతో, ఆయన కళాశాల గేటు బయటే విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్లనే ఇటీవలి కాలంలో గురుకులాలు, పాఠశాలల్లో విద్యార్థులు సమస్యలు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. ఫుడ్ పాయిజన్ కావడం, విషపురుగులు కుట్టడం, ఆహారంలో బల్లులు పడడం వంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే 57 మంది విద్యార్థులు గురుకులాల్లో చనిపోవడం బాధాకరమన్నారు.

### కేసీఆర్ ఆనవాళ్లు తుడిచేయాలని కుట్ర

''తెలంగాణలో కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తా.. కేసీఆర్ ఆనే మొక్కను ఇకపై మొలవనీయను''.. అంటూ సీఎం రేవంత్‌రెడ్డి అన్ని సభల్లో శపథాలు చేస్తున్నారని, అందుకు అనుగుణంగానే కుట్రలు పన్నుతున్నారని తేటతెల్లమైందని కొప్పుల మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ చరిత్ర లేకుండా చేయడానికి ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. మైనారిటీల ప్రగతి ప్రధాత కేసీఆర్ అని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు, గురుకుల పాఠశాలలు, కేసీఆర్‌కిట్లు, కల్యాణలక్ష్మి, గొర్రెల పంపిణీ, చేపపిల్లల పంపిణీ ఇలా ఎన్నో చేశామని.. ఇవ్వన్నీ కేసీఆర్ ఆనవాళ్లు అని, వీటన్నింటినీ లేకుండా చేయడానికి కుట్ర జరుగుతున్నదని దుయ్యబట్టారు. ఒకప్పుడు తెలంగాణకు విదేశాల్లో సైతం గౌరవం ఉండేదని.. ఇప్పుడు అసహ్యించుకునేలా చేశారని మండిపడ్డారు. తాము మైనార్టీ గురుకులానికి వచ్చింది ఆందోళనలు చేయడానికి కాదని, విద్యార్థులను పరామర్శించి వారిలో మనోధైర్యాన్ని నింపి, ఏమైనా సమస్యలు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి మాత్రమేనని చెప్పారు. కలెక్టర్ అనుమతి లేకుండా ఎవరూ రావద్దని ఆంక్షలు పెట్టడం ఎంతమాత్రం సరికాదన్నారు. ఇక్కడ డీసీఎమ్మెస్ చైర్మన్ డాక్టర్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ముస్లిం మైనారిటీ నాయకులు యూనుస్, ఆసిఫ్, నాయకులు చిలవేరి శ్యాంసుందర్, తిర్మందాస్ అశోక్, అనంతుల లక్ష్మణ్, తరాల కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

# సంపన్నులకే ప్రయోజనాలు

కేంద్ర బడ్జెట్‌పై సీఐటీయూ నిరసన



సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ) : కేంద్ర బడ్జెట్‌లో బీజేపీ ప్రభుత్వం సంపన్నులు, కార్పొరేట్ శక్తులకే ప్రయోజనాలు, ప్రాధాన్యతనిస్తున్నదని సీఐటీయూ నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో పార్టీ జిల్లా కార్యదర్శి కోడం రమణ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై సీఐటీయూ నిరసన తెలిపింది. రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపును బడ్జెట్‌లో ప్రకటించినా, పాత పద్ధతిలో ఎటువంటి మార్పులనూ ప్రస్తావించక పోవడం నష్టమేనన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో ఉపాధి కల్పన, కార్మిక భద్రతకు అంశాలు ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించక పోవడం అన్యాయమన్నారు. విభజన హామీ చట్టంలోని అంశాలను తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ పదేళ్ల తర్వాత కూడా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. నిరసనలో నాయకులు అన్నల్‌దాస్ గణేశ్, తదితరులు పాల్గొన్నారు.













